సాక్షి పెద్దపల్లి

శనివారం, 2, మార్చి, 2024

ఏపీఏలో 108శాతం ఉత్పత్తి



రామగిరి: ఫిబ్రవరిలో ఆర్జీ–3లో 141శాతం, ఏపీఏ గనిలో 108 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. ఆర్జీ–3లో నిర్దేశిత 4.80లక్షల టన్నులకు 6.78 లక్షల టన్నులు, ఏపీఏలో నిర్దేశిత 1.27 లక్షల టన్నులకు 1.37 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించినట్లు వారు వివరించారు.

ఆర్జీ–1లో 129శాతం ఉత్పత్తి



గోదావరిఖని: ఫిబ్రవరిలో ఆర్జీ–1లో 129శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం శ్రీనివాస్ తెలిపారు. నిర్దేశిత 3,36,400 టన్నులకు 4,32,519 టన్నుల బొగ్గు ఉత్తి సాధించినట్లు ఆయన వివరించారు. సీ అండ్ ఎండీ బలరాంనాయక్ ఆదేశాల మేరకు గోదావరిఖనిలో త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.6/21.2

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, రాత్రివేళ చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఐజీగా బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ(రామగుండం): పదోన్నతి పొందిన రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. ఫిబ్రవరి 14న డీఐజీ హోదాలో బాధ్యతలు స్వీకరించిన పోలీస్ కమిషనర్.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఐజీ హోదాలో పోలీస్ కమిషనర్ బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు రమేశ్, కృష్ణ, ప్రకాశ, వెంకటేశ్వర్లు, రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు తదితరులు సీపీకి శుభాకాంక్షలు తెలిపారు.

టీబీపై అపోహలు వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: టీబీపై అవగాహన లేక ప్రజలు ఆందోళన చెందుతున్నారని, అవగాహన కల్పిస్తే వ్యాధి నియంత్రణ సాధ్యమని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం టీబీ నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులపై రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. వచ్చే ఏడాది(2025) వరకు టీబీ రహిత దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్ రాజగోపాల్, సభ్యులు రమేశ్, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ తొడుపునూరి శ్రీనివాస్, ఏవో పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయండి



దోనర్ కార్డులతో ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): నేత్రదానం ఒక గొప్ప పుణ్యకార్యమని సదాశయ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా శిక్షణ(ఎంవీటీసీ) కేంద్రంలో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొంది ట్రెనింగ్ తీసుకుంటున్న యువ సింగరేణి కార్మికులకు లింగమూర్తి నేత్ర, శరీర అవయవ దానాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా 42 మంది ఉద్యోగ, కార్మికులు నేత్రదానానికి ముందుకు వచ్చారు. ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమేశ్, ట్రెనింగ్ మేనేజర్ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్లు సతీశ్, మహేశ్, రాములు పాల్గొన్నారు.

22 వేల మంది భక్తులను తరలించాం



మాట్లాడుతున్న విజయమాధురి, సునీత

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం నుంచి మేడారం సమ్మక్క – సారలమ్మ జాతరకు 180 బస్సుల ద్వారా 822 ట్రిప్పులు నడిపించామని, మొత్తం 22,272 మంది భక్తులను సురక్షితంగా చేర్చామని కోరుట్ల, జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్లు విజయమాధురి, సునీత తెలిపారు. స్థానిక బస్టాండ్ వద్ద శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. 180 బస్సులను 2,78,322 కిలోమీటర్ల దూరం నడిపించడం ద్వారా ఆర్టీసీకి రూ.1,99,56,200 ఆదాయం సమకూరిందని వివరించారు. జాతర నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. బస్‌స్టేషన్ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు.

చీపురు పట్టి.. చెత్త ఊడ్చి..



చెత్త తొలగిస్తున్న శ్రీకాంత్, ఉద్యోగులు

కోల్‌సిటీ(రామగుండం): మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, ఇంజినీర్లు, అధికారులు శుక్రవారం చీపుర్లు చేతపట్టి చెత్త ఊడ్చారు. గోడలపై బూజు దులిపారు. ప్లాస్టిక్ కవర్లు ఏరివేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, సెక్రటరీ రాజు, అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, సూపరింటెండెంట్ మనోహర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ మధుకర్, వివిధ విభాగాల సిబ్బంది పాలుపంచుకున్నారు.

ఎన్టీపీసీ జిగేల్

పూర్తయిన తెలంగాణ స్టేజీ–1 ప్రాజెక్టు

- అందుబాటులోకి 1,600 మెగావాట్ల విద్యుత్
- 85శాతం కరెంట్ మన రాష్ట్రానికే కేటాయింపు
- 4న జాతికి అంకితం చేయనున్న ప్రధాని నరేంద్రమోదీ



సంబురాల్లో ఈడీ కేదార్ రంజన్ పాండు, ఉద్యోగులు



జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎన్టీపీసీలోని తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ–1 నిర్మాణం పూర్తయ్యింది. ఇందులోని రెండు యూనిట్లలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి దశలోకి చేరుకున్నాయి. 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను గురువారం అర్ధరాత్రి కమర్షియల్ ఆపరేషన్ డిక్లేర్(సీవోడీ) ప్రకటించారు. దీంతో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు.. ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఇందులోని 800 మెగావాట్ల మొదటి యూనిట్ ఐదు నెలల క్రితమే సీవోడీ ప్రకటించారు. తద్వారా రెండు యూనిట్లలోని మొత్తం 1,600 మెగవాట్ల విద్యుత్ అందుబాటులోకి రాగా.. తెలంగాణ స్టేజీ–1 ప్రాజెక్టు సంపూర్ణంగా ఉత్పత్తి దశలోకి వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85శాతం తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేస్తారు.

ఇక స్టేజీ–2పై దృష్టి..

- తెలంగాణ ప్రాజెక్టులోని స్టేజీ–1 పూర్తికావడంతో స్టేజీ–2లోని ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యంగల మూడు యూనిట్లు(మొత్తం 2,400 మెగావాట్లు) నిర్మించాల్సి ఉంది.
- స్టేజీ–1లోని రెండో యూనిట్‌ను ఈనెల 4వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ ఆదిలాబాద్‌లో నిర్వహించే సభలో వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు.
- తెలంగాణ రాష్ట్ర విభజన చట్టంలో ఎన్టీపీసీ ద్వారా 4వేల మెగావాట్లను ఎన్టీపీసీ ఆవరణలో నిర్మిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించింది.
- ఈక్రమంలో తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ–1, స్టేజీ–2 ప్రాజెక్టులు చేపట్టింది.
- ఇందుకు అవసరమైన బొగ్గును సింగరేణి సంస్థ నుంచి ఏటా 68.5 లక్షల టన్నుల వరకు ఎన్టీపీసీకి సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంది.

పర్యావరణ పరిరక్షణ చర్యలు..

అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో అధిక సామర్థ్యం గల ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్, ఎఫ్‌జీడీ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ నిర్వహణలో 275 మీటర్ల ఎత్తుగల చిమ్నీతో దేశంలో తొలి800 మెగావాట్ల ఫ్లూ గ్యాస్ డి–సల్ఫరైజేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించడంతో బొగ్గు వినియోగం భారీగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాదు.. తక్కువ కాలుష్యం వెలువడుతుందని అంటున్నారు.

ఎన్టీపీసీ ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 74,758 మెగావాట్లు

- మనదేశంలోని అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ పవర్ కంపెనీ ఎన్టీపీసీ లిమిటెడ్ తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్(ఎస్‌టీపీపీ) స్టేజ్–1లోని 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండో యూనిట్ వాణిజ్య కార్యకలాపాలను గురువారం అర్ధరాత్రి ప్రారంభించారు.
- దీనిద్వారా ఎన్టీపీసీ స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 58,638 మెగావాట్లకు చేరుకుంది.
- గ్రూప్ కేటగిరీలో వాణిజ్య సామర్థ్యం 74,758 మెగావాట్లుగా నమోదు చేసుకుందని అధికారులు వెల్లడించారు.

అధికారుల సంబురాలు

తెలంగాణ స్టేజీ–1లో నిర్మించిన 800 మెగావాట్ల రెండో యూనిట్‌ను సీవోడీ ప్రకటించడంతో అధికారులు, ఉద్యోగులు గురువారం రాత్రి సంబురాలు చేసుకున్నారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతోపాటు వివిధ విభాగాలు వేడుకల్లో మునిగి తేలాయి. ఈ సందర్భంగా ఈడీ అందరికీ అభినందనలు తెలిపారు.

తెలంగాణ ప్రాజెక్టు స్టేజీ-1 స్వరూపం ఇదీ..

నిర్మాణ స్థలం	ఎంజీఆర్ బల్బ్
టెక్నాలజీ	అల్ట్రా సూపర్, క్రిటికల్
బొగ్గు అవసరం	8.0 ఎంటీపీఏ
నీటి వనరు	ఎల్లంపల్లి బ్యారేజీ(2టీఎంసీలు)
పబ్లిక్ హియరింగ్	23, మే 2015
బొగ్గు సరఫరా	సింగరేణి సంస్థ
పీపీఏ సంతకం	2016 జనవరి 18(టీఎస్- ఎస్‌డీపీఎల్)
ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్	2016 జనవరి 20
పెట్టుబడి	రూ.10,598.98 కోట్లు
జీరో తేదీ	2016, జనవరి 29

ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

- అర్హులందరికీ పథకాలు అందాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేసే గ్యారంటీ పథకాల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఉందని పేర్కొన్నారు. ఈ పథకాల వర్తింపు కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు ఇవ్వని వారినుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం, ఇతర సమస్యల పరిష్కారానికి మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పరీక్షలు ప్రశాంతంగా జరగాలి..

జిల్లాలో ఇంటర్, టెన్త్ పరీక్షలను సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. డీజీపీ, ఇతర ఉన్నతాధికారుతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు అర్హులందరికీ చేరాలని అన్నారు. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులకోసం, పొరపాట్లు దొర్లితే సరిచేసేందుకు వీలుగా పాలనసేవా కేంద్రాలు ఏర్పాటు చేసి డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని సూచించారు. ఆ కేంద్రాలకు అసవరమైన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

ఆర్వో ప్లాంట్ల నిర్వహణ ఎన్టీపీసీదే



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఎన్టీపీసీ ఈడీ పాండు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

రామగుండం: ఎన్టీపీసీ ప్రభావిత గ్రామాల్లో ఆర్వో ప్లాంట్ల స్థాపనతోపాటు నిర్వహణ బాధ్యత ఎన్టీపీసీ చేపట్టాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ కోరారు. సీఎస్ఆర్ నిధులతో కుందనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ నిర్వాసిత ప్రాంతాల్లో ప్రధానమైన కుందనపల్లికి రూ.కోట్లు కేటాయిస్తూ మోడల్ టౌన్‌షిప్ ఏర్పాటుకు ఎన్టీపీసీ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ, మిషన్ భగీరథ డీఈ సునీల్, ఎంపీవో మోతె సమ్మిరెడ్డి, గ్రామస్తులు సంగనవేణి శేఖర్, సుంకరి రవి, కారోబార్ కైతోజు విజయ్ పాల్గొన్నారు.

మల్యాలపల్లి రహదారికి మోక్షం

ఎన్టీపీసీ ప్రభావిత మల్యాలపల్లిలో ప్రధాన రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఎన్టీపీసీ ప్రధాన నిర్వాసిత మల్యాలపల్లికి రహదారిపై పాలకులు నిర్లక్ష్యం వహించారన్నారు. తాను ఎన్టీపీసీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి రూ.26 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టామని తెలిపారు. కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, ఉన్నతాధికారులు సామ్యూల్, ప్రశాంత్, జేడీరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజలు మెచ్చే పాలన

కోల్‌సిటీ(రామగుండం): 'ప్రజలు మెచ్చే ప్రజాపాలన మాది.. ప్రతీ పేద కుంటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది' అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. బీఆర్ఎస్ మోసపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని విమర్శించారు. అందుకే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా త్వరలో రూ.లక్షతోపాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 76 మందికి చెక్కులు అందజేసినట్లు వెల్లడించారు. నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్, కార్పొరేటర్లు, అధికారులు, నాయకులు తదదితరులు పాల్గొన్నారు.

మంథని ప్రజల గుండెల్లో 'శ్రీపాద'

- నేడు అధికారికంగా మాజీ స్పీకర్ జయంతి
- హైదరాబాద్ రవీంద్రభారతిలో వేడుకలు
- నియోజకవర్గంలో విగ్రహాలకు ముస్తాబు



శ్రీపాదరావు విగ్రహం వద్ద శ్రీధర్‌బాబు నివాళి(ఫైల్)

మంథని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్, మంథని మాజీ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు 87వ జయంతిని తొలిసారి శనివారం అధికారికంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు అన్నిఏర్పాట్లు సిద్ధం చేశారు. మంథని నియోజకవర్గంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా శ్రీపాదరావు విగ్రహాలను ముస్తాబు చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రబారతిలో నిర్వహించే ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

పేదల మదిలో..

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన శ్రీపాదరావు 1935లో జన్మించారు.
- న్యాయ విద్య అభ్యసించిన ఆయన.. సర్పంచ్, సమితి అధ్యక్షుడిగా పనిచేసి శాసనసభకు ఎన్నికయ్యారు.
- 1983, 1985, 1989లో వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సేవలో పాలుపంచుకున్నారు.
- ఉమ్మడి ఆంధ్రా సీఎంలు కోట్ల విజయభాస్కర్ రెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి హయాంలో 1992–94 వరకు శాసనసభకు స్పీకర్‌గా శ్రీపాదరావు సేవలు అందించారు.
- 1999 ఏప్రిల్ 13న మహదేవపూర్ మండలం అన్నారం అడవుల్లో శ్రీపాదరావు నక్సల్స్ చేతిలో హత్యకు గురయ్యారు.
- శ్రీపాదరావు నియోజవర్గ అభివృద్ధి అనేక కార్యక్రమాలు చేపట్టారు.
- ఆయన మరణించి 25 ఏళ్లు కావస్తున్నా ఈ ప్రాంత ప్రజలు తమ మదిలో నిలుపుకున్నారు.
- బుచ్చి పంతులుగా పేరున్న శ్రీపాదరావును ఇప్పటికీ తలుచుకుంటూనే ఉంటారు.

20 ఏళ్ల తర్వాత దక్కిన అరుదైన గౌరవం

శ్రీపాదరావు జయంతి అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో కాంగ్రెస్, ఆయన అభిమానుల్లో సంతోషం నింపింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో రామగుండం నియోజకవర్గంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీపాద ఎల్లంపల్లిగా నామకరణం చేసి ఆయన సేవలను గౌరవించారు. సుమారు 20 సంవత్సరాల తర్వాత ప్రస్తుత ప్రభుత్వం శ్రీపాద జయంతి అధికారికంగా నిర్వస్తుండడంతో కాంగ్రెస్ శ్రేణులు, అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

వారంలోగా ధరణి సమస్యలు పరిష్కారం

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ధరణి సమస్యలను వారంలోగా పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ధరణి పెండింగ్ దరఖాస్తులపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. టీఎం 4, 10, 14, 32 మాడ్యూల్స్‌లో సక్సేషన్, జీపీఏ, భూరికార్డులు పరిశీలించి క్షేత్రస్థాయి సిబ్బంది నివేదికల ఆధారంగా తహసీల్దార్లు నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులు తిరస్కరిస్తే తగిన కారణాలు చూపాలని ఆయన ఆదేశించారు. ఇందుకోసం తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ అధ్యక్షతన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు..

జిల్లాలో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఎస్సారెస్పీ నీటి(5వతడి) విడుదలపై అధికారులతో సమీక్షించారు. అధికారుల లెక్కల ప్రకారం ఏడువేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారన్నారు. డి – 83, డి–86 కాలువల కింద 2,500 క్యూసెక్కులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వారంలో మూడురోజుల పాటు (సోమ, బుధ, శనివారాల్లో) సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి తోపాటు నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నారు.

పేదలకు సర్కార్ అండ

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన నిరుపేద యువతి ఓడ్నాల స్వప్న వివాహానికి ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ రూ.పదివేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ కొడారి హన్మయ్య, నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, లావుడ్య రూప్లానాయక్, జితేందర్‌రానాయక్, దేవేందర్‌రెడ్డి, కాడే సూర్యనారాయణ, దేవి జనార్దన్, సోగాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరిచండి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆడెపు సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో లక్ష్మణ్‌కుమార్‌ను కలిశారు. తొలుత యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, సర్వీస్ నష్టపోయిన ఉపాధ్యాయులకు సర్వీస్ కలుపుతూ నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నూతన రిక్రూట్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నియామకం, ఇంటర్ బోధిస్తున్న పీడీటీలకు జేఎల్ కేడర్ వర్తింపు, టీజీటీలపై పనిభారం తగ్గింపు, జాతీయ విద్యా సంస్థలు సూచించిన ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని అనుసరించాలని వారు విన్నవించారు.

రేపు గురుకుల ప్రవేశపరీక్ష

పెద్దపల్లిరూరల్: మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం ఈనెల 3న(ఆదివారం) ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పరీక్షల జిల్లా కన్వీనర్ సుస్మిత తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ విద్య నోడల్ అధికారి కల్పన తెలిపారు. ఇంగ్లిష్–1 పేపర్ పరీక్షకు 5,477 మందికి 5,177 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. 94.52 శాతం హాజరు నమోదైందని ఆమె వివరించారు.

బకాయిదారులకు ఊరట

- ఆస్తిపన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ
- ఈనెలాఖరు వరకు గడువు
- జాబితా సిద్ధం చేస్తున్న కమిషనర్లు



రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం

కోల్‌సిటీ(రామగుండం): నగరపాలక, పురపాలక సంస్థల్లో ఆస్తిపన్ను బకాయిలదారులకు ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్)ప్రకటిండం ద్వారా బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ కానుంది. ఈనెల 31వ తేదీ వరకు చెల్లింపుల కోసం గడువు విధించింది. 2023 మార్చి నాటికి ఆస్తిపన్ను, వడ్డీ, జరిమానా చెల్లించిన వారికి ఈ పథకం వర్తిస్తుందని, వారు చెల్లించిన 90 శాతం వడ్డీ మొత్తాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నులో రాయితీ కల్పించనున్నట్లు అధికారులు వివరించారు.

ఒక కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల్లో..

- రామగుండం నగరపాలక సంస్థతోపాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ఓటీఎస్ అమలుతోపాటు బకాయిదారుల నుంచి స్పందన వచ్చేందుకు మున్సిపల్ కమిషనర్లు దృష్టి పెట్టారు.
- ఆస్తిపన్ను చెల్లించనివారి జాబితా సిద్ధం చేస్తున్నారు.
- దీని ఆధారంగా బకాయిదారుల వద్దకే నేరుగా వెళ్లి వడ్డీ మాఫీపై అవగాహన కల్పించి, ఆస్తి పన్ను వసూలు చేస్తారు.

బల్దియాలో రూ.3.48కోట్ల వడ్డీ

రామగుండం నగరపాలక సంస్థలో రూ.14.62 కోట్ల వరకు ఆస్తిపన్ను డిమాండ్ ఉండగా, ఇప్పటివరకు రూ.5.93కోట్ల వరకు వసూలైంది. ఎరియర్స్ రూ.6.96కోట్ల వరకు ఉండగా, ఇందులో రూ.3.48కోట్ల మేరకు వడ్డీ ఉంది. 90 శాతం వడ్డీ మాఫీతో బకాయిదారుల నుంచి ఆస్తిపన్ను వసూలు చేయడాకి చర్యలు చేపట్టనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31లోపు బకాయిలతో సహా ఆస్తిపన్ను మొత్తం ఒకేసారి చెల్లించిన వారికే ఈ రాయితీ వర్తిస్తుంది.

– బి.అనిల్‌కుమార్, నగర మేయర్, రామగుండం

సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాల అభివృద్ధి

ఓదెల(పెద్దపల్లి): సీసీ రోడ్ల నిర్మాణంతో సమస్యలు దూరమవుతాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బాయమ్మపల్లె, ఇందుర్తి గ్రామాల్లో రూ.10లక్షల వ్యయంతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతోందన్నారు. ఈకార్యక్రమంలో పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, నాయకుడు కంకణాల భాస్కర్‌రెడ్డి, ఏతాఈ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


నవీన్ (ఫైల్)

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నవీన్ (31) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఎంబీఏ చేసిన నవీన్ చదువు పూర్తి కాగానే గల్ఫ్ దేశం వెళ్లి వచ్చాడు. ఆరేళ్ల క్రితం వివాహం చేసుకుని స్వగ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటున్నాడు. కాగా వివాహం జరిగి ఆరేళ్లు అవుతున్నా సంతానం కలగడం లేదని మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని బలవన్మరణం

సిరిసిల్లక్రైం: భార్యభర్తలకు జరిగిన గొడవలో అవమానం భరించలేక భర్త ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిరిసిల్లలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల సుభాష్‌నగర్‌కు చెందిన నాగుల శ్రీకాంత్ (42) పవర్‌లూం బీముల కార్మికుడు. శుక్రవారం ఉదయం భార్యతో చిన్నపాటి గొడవ జరిగింది. ఇంటిలోకి వెళ్లిన శ్రీకాంత్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే కరెంట్ వైర్లు ఉన్న దానికి ఉరేసుకుని మృతి చెందడం అనుమానాస్పదంగా ఉందని స్థానికులు అనడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు.

ఇంటర్‌లో ముగ్గురు డిబార్

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ ముగ్గురు డిబార్ అయినట్లు డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా జనరల్ విభాగంలో 15,202 మందికి గాను 466 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. 14,736 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1,660 మందికి గాను 520 మంది గైర్హాజరు కాగా.. 1,140 మంది హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగాలను కలుపుకొని జిల్లావ్యాప్తంగా 16,862 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా.. 986 మంది గైర్హాజరయ్యారు. 15,876 మంది హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు.

కాపర్ వైరు చోరీ

ధర్మపురి: ట్రాన్స్‌ఫారాలను ధ్వంసం చేసి సుమారు రూ.40 వేల విలువ గల కాపర్‌వైరును దొంగలు ఎత్తుకెళ్లారు. మండలంలోని నక్కలపేట, గాదెపెల్లి గ్రామాల్లో రైతులు పంట పొలాల్లో ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం రాత్రి దొంగలు వాటిని ధ్వంసం చేసి కాపర్ వైరు ఎత్తుకెళ్లారు. రైతులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 49 మందికి జరిమానా

సిరిసిల్లక్రైం: జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 49 మందికి జరిమానా విధిస్తూ సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీఎం న్యాయమూర్తి సృజన శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 33 మంది మందుబాబులు పట్టుబడ్డారని తెలిపారు. వీరందరినీ కోర్టులో ప్రవేశపెట్టగా 8 మందికి రూ.2వేల చొప్పున, 25 మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారన్నారు. అలాగే కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందిపై కేసు నమోదు చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా 9 మందికి రూ.2వేలు చొప్పున, ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకునేలా

- ఐసీటీ అకాడమీ ద్వారా విద్యార్థినులకు పవర్ బీఐ, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ
- సవాళ్లను ఎదుర్కొనేలా ట్రైనింగ్
- 21 రోజుల శిక్షణకు 115 మంది ఎంపిక
- 'జ్యోతిష్మతి'లో కొనసాగుతున్న కార్యక్రమం


సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్న ట్రైనర్లు

తిమ్మాపూర్(మానకొండూర్): అవకాశాలు అన్నిరంగాల్లో అనేకం ఉంటాయి. వాటిని అందిపుచ్చుకోవడమే అసలు సవాల్. ఏటా లక్షల మంది ఇంజినీరింగ్ పూర్తిచేసి బయటకు వస్తున్నారు. కానీ వారిలో సరైన స్కిల్స్, నూతన సాంకేతికత లేకపోవడంతో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. వంద మందిలో 30 శాతం మంది మాత్రమే మంచి కంపెనీల్లో కొలువులు సాధిస్తున్నారు. 20 శాతం చిన్న కంపెనీలతో సరిపెట్టుకుంటున్నారు. మిగతా 50 శాతం మంది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

స్కిల్స్ పెంపొందించేలా..

విద్యార్థుల్లో సాఫ్ట్ స్కిల్స్ పెంచేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) అకాడమీ ఆధ్వర్యంలో సెంటర్ ఎక్స్‌లెన్స్ స్థాపించారు. విద్యార్థినులకు దీని ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాఫ్ట్ స్కిల్స్ పెంచడమే లక్ష్యంగా ఇది పనిచేస్తోంది.

జ్యోతిష్మతిలో శిక్షణ..

ప్రస్తుతం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం జ్యోతిష్మతి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీటీ సెంటర్ ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందుకోసం జిల్లాలోని 115 మంది విద్యార్థినులను ఎంపిక చేశారు. పవర్ బీఐ 15 రోజులు, 6 రోజులు సాఫ్ట్ స్కిల్స్‌పై మైక్రోసాఫ్ట్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో 35 ప్రోగ్రామ్స్‌లో శిక్షణ ఇస్తుంది. విద్య, నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలకు అడ్డంకులు తొలగించేలా శిక్షణ కార్యక్రమాలు ఉంటున్నాయి.

సాఫ్ట్ స్కిల్స్‌పై 21 రోజులపాటు శిక్షణ అందించేలా ట్రైనింగ్ నిర్వహించారు. శిక్షణ అనంతరం ప్రపంచ స్థాయి మైక్రోసాఫ్ట్ శిక్షణ ధ్రువీకరణతో కూడిన ఉద్యోగ అవకాశాలను కూడా పొందవచ్చు. ఈమేరకు ట్రైనింగ్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు. కాగా సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా మహిళలు ఉద్యోగావకాశాలు పొందాలన్న ఉద్దేశంతో పే పాల్ కంపెనీ సహకారంతో ఐసీటీ ఆధ్వర్యంలో 115 మంది విద్యార్థినులకు ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ అభిప్రాయాలు 'సాక్షి'తో పంచుకున్నారు.

కచ్చితంగా ఉద్యోగం సాధిస్తా



నిత్యం శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నా. శిక్షణ పూర్తయిన తర్వాత పరీక్ష నిర్వహించి గ్లోబల్ సర్టిఫికేషన్ సైతం అందిస్తారు. దాంతో మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించవచ్చు. మంచి కంపెనీలో ఉద్యోగం సాధిస్తా.

– వాస్తవిక, సీఎస్ఈ, ఫైనల్ ఇయర్

ధైర్యం వచ్చింది



టెక్నికల్ స్కిల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ తీసుకుంటున్న. గ్రూప్ డిస్కషన్ ఇంటర్వ్యూ శిక్షణ ఇచ్చారు. ఇంటర్వ్యూ ఫేస్ చేసే ధైర్యం వచ్చింది. ఉద్యోగాల్లో మహిళలు ముందుండాలనే ఉద్దేశంతో జ్యోతిష్మతిలో ట్రైనింగ్ ఇవ్వడం ఆనందంగా ఉంది.

– వైష్ణవి, సీఎస్ఈ (ఏఐఅండ్ఎంఎల్), ఫైనల్ ఇయర్

నైపుణ్యాలు అవసరం



విద్యార్థులకు మార్కులు, ర్యాంకులతోపాటు ఉద్యోగ సాధన నైపుణ్యాలు ముఖ్యం. మంచి ర్యాంకులు ఉన్నా ఇంటర్వ్యూలో చాలామంది ఉద్యోగం కోల్పోతున్నారు. టెక్నికల్, సాఫ్ట్ స్కిల్స్ ఉన్న విద్యార్థులే సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు రావాలంటే సాఫ్ట్ స్కిల్స్ తప్పనిసరి.

– కుమార్, పల్లెపంగు జోయేల్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షకులు, హైదరాబాద్

ప్రతి మహిళ ఉద్యోగం చేయాలి



అబ్బాయిలతో పోటీగా ప్రతీ అమ్మాయి ఉద్యోగం చేయాలి. మహిళామణులు ఉద్యోగాల్లో కీలకంగా ఉండాలని ఉద్దేశంతో ఐసీటీ వారు జ్యోతిష్మతిలో 21 రోజుల పాటు మహిళా సాధికారత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థినులు మైక్రోసాఫ్ట్ శిక్షణ పొంది గ్లోబల్ సర్టిఫికెట్ అర్హత సాధించి మంచి కంపెనీలో ఉద్యోగంలో చేరుతారు.

– జువ్వాడి సాగర్ రావు, జ్యోతిష్మతి కళాశాల చైర్మన్

ఫెర్టిలిటీ డాక్టర్, సిబ్బందిపై కేసు

కరీంనగర్‌టౌన్: సంతానం కలగాలని నగరంలోని ఓ ఫెర్టిలిటీ కేంద్రానికి వచ్చిన మహిళ వద్ద డబ్బులు తీసుకొని ట్రీట్మెంట్ చేయకుండా అదనంగా డబ్బులు కావాలని బెదిరింపులకు గురి చేయడమే కాకుండా ఆసుపత్రిలో బంధించిన డాక్టర్, సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి తనకు సంతానం కలగాలని నగరంలోని డాక్టర్ పద్మజ సంతన సాఫల్య కేంద్రాన్ని సంప్రదించారు. రూ.5లక్షలు తీసుకొని ఎలాంటి ట్రీట్మెంట్ చేయకుండా ఇంకా అదనంగా రూ.80వేలు కట్టమనగా.. నాగలక్ష్మి తన భర్త వీర వెంకటరావు ఇదివరకే చాలా డబ్బులు కట్టాం, ఇంకా ఎందుకు కట్టాలని ప్రశ్నించారు. వారిని దూషించి హాస్పిటల్‌లో బంధించారు. చంపుతామని బెదిరించారని ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కరీంనగర్ టూటౌన్ ఇన్స్పెక్టర్ ఓ.వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై..

సిరిసిల్లక్రైం: నకిలీ భూపత్రాలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడుతున్న సిరిసిల్ల పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ మండలం తెట్టెకుంట, చంద్రగిరి గ్రామపరిధిలోని సర్వే నం.6లోని 126 చదరపు గజాల స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి, అసలు హక్కుదారుడైన కరీంనగర్‌కు చెందిన రేకల బెంజిమెన్‌ను బెదిరించి ఆక్రమించాలని చూశాడన్నారు. బాధితుడు శుక్రవారం వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సిరిగిరి రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హైకోర్టు ఏజీపీగా అరుణ్‌కుమార్


అరుణ్‌కుమార్

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, ప్రస్తుత జెడ్పీటీసీ మార్కొండ లక్ష్మి కుమారుడు మార్కొండ అరుణ్‌కుమార్ హైకోర్టు ఏజీపీగా నియామకమయ్యారు. ఈమేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అరుణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

అగ్ని ప్రమాదంలో భారీ నష్టం



జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో మైసమ్మగడ్డ వద్ద సిద్ధార్థ ఏజెన్సీలో మంటలు చెలరేగి తీవ్ర నష్టం జరిగింది. పోలీసుల వివరాలు.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి బండారి రామన్న ఇటీవల ఏర్పాటు చేసుకున్న సిద్ధార్థ ఏజెన్సీలో గురువారం రాత్రి మంటలు చెలరేగడంతో స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. శుక్రవారం ఉదయం బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి 1.56 గంటలకు ఏజెన్సీకి నిప్పు పెట్టినట్లు రికార్డు అయ్యింది. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

గంజాయి పట్టివేత


నిందితులను అరెస్టు చేసిన సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్‌క్రైం: నగరంలోని భగత్‌నగర్‌లో శుక్రవారం ముగ్గురు యువకుల వద్ద గంజాయి పట్టుకున్నట్లు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. భగత్‌నగర్‌లో శాంతినగర్‌కు చెందిన శశికుమార్, పెగడపల్లికి చెందిన రామకృష్ణ, వరంగల్‌కు చెందిన జయంత్ వద్ద గంజాయి ఉన్నట్లు సమాచారంతో దాడి చేసి వారి వద్ద 535గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిని ఎక్సైజ్ అర్బన్ స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో నాగేశ్వర్‌రావుతోపాటు హెడ్ కానిస్టేబుల్ మోసిన్, సిబ్బంది కుమార్‌యాదవ్, ఖాసింబి, కమలాకర్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

చెరుకు పంట దగ్ధం


దగ్ధమవుతున్న చెరుకు పంట

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామంలో ఓ రైతుకు చెందిన చెరుకు పంట దగ్ధమైంది. గ్రామస్తుల వివరాలు.. గ్రామానికి చెందిన నల్ల విఠల్ మూడెకరాల్లో చెరుకు పంట సాగు చేశాడు. పంట చేతికి రావడంతో గురువారం రాత్రి చెరుకు కోత మిషన్ తెప్పించి మరుసటి రోజు కోసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కోత మిషన్ వచ్చిన రోజే చెరుకు పంట అగ్నికి ఆహుతైంది. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా మంటలు ఆర్పేందుకు యత్నించారు. కానీ అప్పటికే సగానికి పైగా పంట కాలిబూడిదైంది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కుట్రతోనే చెరుకు పంటకు నిప్పంటించారని బాధిత రైతు అనుమానం వ్యక్తం చేశాడు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు


గాయపడ్డ కార్మికుడు వినయ్‌రెడ్డి

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధిలోని వకీల్‌పల్లి గనిలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో సింగరేణి కార్మికుడు వినయ్‌రెడ్డి గాయపడ్డాడు. రాత్రి షిఫ్ట్‌లో భాగంగా 74 లెవల్ వద్ద విధులు నిర్వహిస్తుండగా సైడ్‌ఫాల్ అయి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యచికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన కొండపల్కల ఆశీష్‌కుమార్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. అశీష్‌కుమార్ గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉండగా, అదే ప్రాంతానికి చెందిన అర్ముల్ల సాయితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ మన్మథరావు తెలిపారు.

ప్రైవేట్ బస్సు బోల్తా

- గుంటూరుపల్లి స్టేజీ వద్ద ప్రమాదం


బోల్తా పడ్డ ప్రైవేట్ బస్సు

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలోని గుంటూరుపల్లి స్టేజీ ప్రమాదాలకు నిలయంగా మారింది. సాక్షి దినపత్రికలో రోడ్డు ప్రమాదాలపై వరుస కథనాలు ప్రచురించడం జరిగింది. ఈక్రమంలోనే శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. బ్లూకోర్ట్స్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ నుంచి శుక్రవారం రాత్రి ఓ ప్రైవేట్ బస్సు కూలీలతో కరీంనగర్‌కు వస్తోంది. ఈక్రమంలో తెల్లవారుజామున 5 గంటలకు గుంటూరుపల్లి స్టేజీ దాటిన అనంతరం అతివేగంగా వస్తున్న బస్సు అదుపుతప్పి నేరుగా డివైడర్ మీద నుంచి మూడు విద్యుత్ లైట్ల స్తంభాలను ఢీకొట్టి పెద్దపల్లి వైపు బోల్తా పడింది. స్థానికులు వెంటనే బస్సులో ఉన్న కూలీలను బయటకు తీసి రక్షించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 45 మంది వరకు కూలీలున్నట్లు తెలుస్తోంది. అనంతరం క్రేన్ ద్వారా బోల్తా పడిన బస్సును రోడ్డు మీద నుంచి తొలగించారు. ఈ ప్రమాదంలో కూలీలకు గాయాలు కాలేదని, ఎవరు ఫిర్యాదు చేయలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

కారును ఓవర్ టేక్ చేయబోయి..

- బస్సును ఢీకొని ఒకరు మృతి


గాయపడిన ఎల్లయ్య

జగిత్యాల: కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మల్యాల మండలం రాజారం గ్రామ శివారులో జరిగింది. గంగాధర మండలం ర్యాలపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య(36) శుక్రవారం జగిత్యాలకు వచ్చి, తిరిగి వెళ్తుండగా రాజారం శివారులో కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మల్యాల ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి ఘటనా స్థలానికి వెళ్లి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ప్రజాపాలన కేంద్రాలు ఏర్పాటు చేయండి


వీసీలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కరీంనగర్: ప్రభుత్వం మరోరెండు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టిందని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా పథకాలను అమలు చేస్తోందని, లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీచేసిందని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అన్నారు. హైదరాబాద్ నుంచి ఆమె డీజీపీ రవిగుప్త, రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్హులందరికీ గ్యారంటీలు అందేలా ఎంపీడీవో, మున్సిపల్ వార్డు ఆఫీస్‌ల్లో ప్రజా పాలన సేవాకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్ సంఖ్య , గ్యాస్ కనెక్షన్ నెంబర్ విద్యుత్ మీటర్ నంబర్ సమర్పించిన వారందరికీ పథకాలు అమలు అవుతాయని, ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా ప్రజాపాలన సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చని శాంతికుమారి వివరించారు. ఇంటర్, పదో తరగతి కేంద్రాల లోపలికి ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లడానికి వీలులేదన్నారు. నిబంధనలను ఉల్లంఘించి లీకేజీలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, బాధ్యులను విధుల నుంచి తొలగించడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజాపాలన సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, డీఐఈవో జగన్మోహన్ రెడ్డి, డీఈసీ మెంబర్స్ కె.రవీందర్ రెడ్డి, ఆంజనేయులు, జెడ్పీ సీఈవో ఎం.శ్రీనివాస్, డీఈవో జనార్దన్ రావు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్, కొత్తపెల్లి, చొప్పదండి, హుజూరాబాద్ మున్సిపల్ కమిషనర్లు రమేశ్ , నాగరాజు సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు, ఫోన్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సంపత్

కరీంనగర్: మత్తు పదార్థాలు, ఫోన్లకు పిల్లలు దూరంగా ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ అన్నారు. శుక్రవారం పద్మనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో స్నేహిత, మహిళా దినోత్సవ వారోత్సవాల అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. బాలికలు యుక్త వయస్సులో వచ్చే మార్పులతో తెలిసి తెలియని ప్రేమకు ఎక్కువ ఆకర్షితులవుతున్నారని అన్నారు. సినిమాలు, సీరియళ్లలో ప్రేమ వరకే చూపిస్తారని, పెళ్లి తరువాత వచ్చే కష్టాలను చూపించరన్నారు. మాదకద్రవ్యాలు, స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్, సిగరెట్, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్ పాస్‌వర్డ్, సోషల్ మీడియా, ఇంటర్నెట్ ద్వారా ఏవిధంగా మోసపోతున్నారో అవగాహన కల్పించారు. జీసీడీవో కృపరాణి, సీడీపీవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ అరుణ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కేసు వర్కర్ సాయికిరణ్, షీ టీం పోలీస్ కానిస్టేబుల్ స్వప్న, సఖీ సంధ్య, ప్రిన్సిపాల్, టీచర్లు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు

జగిత్యాలజోన్: అక్రమ సంబంధం అనుమానంతో ఒకరిని హత్య చేసేందుకు ప్రయత్నించిన నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిల్ల మురళి కథనం ప్రకారం.. మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన పిట్టల సుదర్శన్ అతడి సంబంధీకుడైన పిట్టల రవి మధ్య ఓ అక్రమ సంబంధంపై అనుమానాలు మొదలైనాయి. ఈ విషయంపై పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో సుదర్శన్ జూన్ 4, 2020 రోజున రాత్రి 9.30 గంటల సమయంలో తన ఇంటి వెనుకకు బహిర్భూమికి వెళ్లగా, పిట్టల రవి ఇదే అదనుగా భావించి సుదర్శన్‌పై కత్తితో దాడి చేయగా పలు చోట్ల తీవ్ర గాయాలైనాయి. సుదర్శన్ అరుపులు విన్న అతడి భార్య బయటకు వెళ్లగా ఆమెను సైతం తోసేశాడు. చుట్టుపక్కల వారు వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న సుదర్శన్‌ను జగిత్యాల ఆసుపత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. ఈ ఘటనపై బాధితుడి భార్య లక్ష్మి మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడు రవిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు డి.శ్రీధర్, కెవి.సాగర్, కిరణ్‌కుమార్ బలమైన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం నిందితుడైన రవికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.4 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

బాలుడిని విక్రయించిన తల్లి?

- దత్తత ఇచ్చినట్లు పుకార్లు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన పదేళ్ల బాలుడిని విక్రయించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. సదరు మహిళకు కుమారుడు జన్మించిన తర్వాత మూడేళ్ల క్రితం భర్తతో వివాదాలు వచ్చి విడాకులు తీసుకుంది. దీంతో కొద్దిరోజులుగా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో కొడుకుతో కలిసి ఉంటోంది. నిత్యం తన కొడుకును కొట్టడంతో పాటు ఇబ్బందులకు గురిచేస్తోంది. దీంతో స్థానికులు పలుమార్లు ఆమెపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రెండురోజుల క్రితం గుట్టు చప్పుడు కాకుండా బాలుడిని రూ.2 లక్షల నగదు, 3 తులాల బంగారం తీసుకుని విక్రయించినట్లు సమాచారం. ఈక్రమంలో సదరు మహిళను గురువారం స్థానికులు నిలదీయగా, పక్క గ్రామానికి చెందినవారికి దత్తత ఇచ్చానని చెప్పినట్లు తెలిసింది. కాగా మహిళ చెప్పిన మాటలు పొంతనలేకుండా ఉండటంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ద్వారా దత్తత ఇచ్చానని సదరు మహిళ చెప్పిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు


ప్రమాదానికి గురైన కారు

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధి అలుగునూర్ చౌరస్తా సమీపంలో రాజీవ్ రహదారిపై పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు రహదారి మధ్యలోని మొక్కలకు నీరు పడుతున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ కారు బలంగా ఢీకొట్టింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. మండలంలోని మహాత్మానగర్‌కు చెందిన అనుమాండ్ల రాజేందర్ కారులో శుక్రవారం ఉదయం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. రాజేందర్ స్వల్ప గాయాలతో బయటపడినా కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. రాజీవ్ రహదారిపై పనిచేసే కార్మికులు జాగ్రత్తగా ఉండాలని కొద్దిదూరం ముందే సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని వాహన దారులు అంటున్నారు. విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై చేరాలు తెలిపారు.

దంపతులకు రిమాండు

గంగాధర(చొప్పదండి): వ్యాపారి వద్ద నుంచి రూ.56 లక్షలు అప్పుగా తీసుకొని, హామీగా మూడెకరాల ముప్పైతొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేయించి, వ్యాపారికి తెలియకుండా నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి ఇతరులకు అమ్మి మోసానికి పాల్పడిన భార్యభర్తలను అరెస్ట్ చేసి రిమాండుకు పంపించినట్లు గంగాధర ఎస్‌ఐ అభిలాశ్ తెలిపారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన మాల కనకయ్య కరీంనగర్‌లోని గాంధీనగర్‌కి చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి నుంచి 2016లో రూ.ముప్పైలక్షలు, 2017లో రూ.ఇరవై ఆరు లక్షలు అప్పుగా తీసుకొని హామీగా భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేయడమేగాక రెండు బ్యాంకు చెక్కులను ఇచ్చారు. మోహన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసిన పోలీసులు విచారణలోవాస్తవమని తేలడంతో కనకయ్య,మంజులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. కేసును పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితులిద్దరికి 14 రోజుల రిమాండ్ విధించగా జైలుకు తరలించారు.

ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టిన వ్యక్తి అరెస్ట్


బద్దెనపల్లిలో కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని బద్దెనపల్లిలో మూడు ద్విచక్ర వాహనాలు దహనం చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ తెలిపారు. రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయికృష్ణ శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజయ్య ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన మూడు బైకులకు నిప్పుపెట్టాడు. తగులబెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు కావడంతో నిందితుడిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయికృష్ణను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.